టీసీఎస్, ఇన్ఫోసిస్‌లోనూ కోతలు

- మూడు నెలల వ్యవధిలో 11,781 మందికి ఊస్టింగ్
- టీసీఎస్‌లో 5,680, ఇన్ఫీలో 6,101 మందికి పింక్ స్లిప్

టీసీఎస్

అక్టోబర్-డిసెంబర్ మధ్య ఉద్యోగ కోతలు: **5,680**

అక్టోబర్-డిసెంబర్ మధ్య వలసల రేటు: **13.3** శాతం

డిసెంబర్ 31నాటికి సంస్థలో మిగిలిన ఉద్యోగులు: **6,03,305**

ఇన్ఫోసిస్

అక్టోబర్-డిసెంబర్ మధ్య ఉద్యోగ కోతలు: **6,101**

అక్టోబర్-డిసెంబర్ మధ్య వలసల రేటు: **12.9** శాతం

డిసెంబర్ 31నాటికి సంస్థలో మిగిలిన ఉద్యోగులు: **3,22,663**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): ఆర్థిక మాంద్యం భయాలు, వ్యయ నియంత్రణ చర్యలు వెరసి దిగ్గజ ఐటీ కంపెనీలు ఉద్యోగుల కోతను కొనసాగిస్తున్నాయి. గూగుల్, ఫ్లిప్‌కార్ట్, యూనిటీ సాఫ్ట్‌వేర్, పేటీఎం, అమెజాన్ తదితర ఐటీ, ఈ-కామర్స్ కంపెనీలు ఇప్పటికే వందలాది మంది ఉద్యోగులను తొలగించగా ఇప్పుడు ఆ జాబితాలోకి దేశీయ ఐటీ దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్ చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో (అక్టోబర్-డిసెంబర్) ఈ రెండు కంపెనీలు ఏకంగా 11,781 మంది ఉద్యోగులకు పింక్ స్లిప్స్ ఇచ్చినట్టు పారిశ్రామికవర్గాలు తెలిపాయి. ఇందులో టీసీఎస్ 5,680 మందిపై వేటు వేయగా, ఇన్ఫీ 6,101 మందికి ఉద్వాసన పలికింది

సిటీ గ్రూప్‌లో 20,000 మందికి ఉద్వాసన

న్యూయార్క్: సిటీ గ్రూప్ భారీగా ఉద్యోగులను తొలగించనున్నది. వచ్చే రెండేండ్లలో 20 వేల మందికి ఉద్వాసన పలుకనున్నది. సంస్థ పునర్వ్యవస్థీకరణ, షేర్‌హోల్డర్లకు రిటర్న్ ఇవ్వాలన్న లక్ష్యంతో తాజా చర్యలు చేపట్టింది. నాలుగో త్రైమాసికం ఫలితాల్లో భారీ నష్టాలు చవిచూసిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. 2022నాటికి సంస్థలో 2,40,000 మంది ఉద్యోగులు ఉండగా, 2026నాటికి ఈ సంఖ్యను 1,80,000కు కుదించనున్నారు.

ఆడిబుల్‌లో 5% ఉద్యోగాలకు కోత

అమెజాన్ కంపెనీల్లో వారంలో మూడో విడత తొలగింపులు

వాషింగ్టన్, జనవరి 12: కొత్త ఏడాది లోనూ టెక్ రంగాల్లో ఉద్యోగాల కోత కొనసాగుతున్నది. దాదాపు 5 శాతం మంది ఉద్యోగులను తొలగించేందుకు దిగ్గజ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ యాజమాన్యంలోని ఆన్‌లైన్ ఆడియో బుక్ అండ్ పాడ్‌కాస్ట్ సర్వీస్ 'అడిబుల్' సిద్ధమైంది. ఈ మేరకు పలువురు ఉద్యోగస్తులకు గురువారం సందేశాలు అందాయి. గత వారం వ్యవధిలో అమెజాన్‌లో మూడో విడత ఉద్యోగాల కోత జరుగడం గమనార్హం. కంపెనీ సవాళ్లను ఎదుర్కొంటున్నదని ఉద్యోగులకు పంపిన మెమోలో ఆడిబుల్ సీఈవో బాబ్ కారిగాన్ పేర్కొన్నారు. తాజా కోత ప్రభావం ఎంత మందిపై పడుతుందనే దానిపై స్పందించేందుకు కంపెనీ అధికార ప్రతినిధి ఒకరు నిరాకరించారు. అమెజాన్ ప్రైమ్ వీడియో, ఎంజీఎం స్టూడియోస్ యూనిట్‌లో ఇప్పటికే ఉద్యోగాల కోతను ప్రకటించారు. దీని ద్వారా వందలాది మంది తమ ఉద్యోగాలు కోల్పోనున్నారు. అంతముందు ఖర్చు తగ్గించుకొనేందుకు, ఆదాయం పెంచుకొనేందుకు 500 మందిని పైగా తొలగిస్తున్నట్టు అమెజాన్‌కు చెందిన స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం ట్విచ్ పేర్కొన్నది.

తైవాన్‌పై యుద్ధమేఘాలు

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

ఇప్పటికే అష్టదిగ్బంధనం చేసిన చైనా

- సైనికచర్య తప్ప అన్ని రకాలుగా డ్రాగన్ దాడులు
- నెట్‌వర్క్‌ను స్వాధీనం చేసుకున్న సైబర్ సంస్థలు
- నేడు తైవాన్‌లో జరుగనున్న అధ్యక్ష ఎన్నికలు

చైనా నుంచి ముప్పు పొంచి ఉండటంతో ఇటీవల తైపే సమీపంలో ఆకాశంలో తైవాన్ జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఆ దేశ సైనిక హెలికాప్టర్

తైవాన్ అధ్యక్షురాలు త్సాయి ఇంగ్-వెన్

తైపే, జనవరి 12: చైనాకు ద్వీపదేశంగా ఉన్న తైవాన్‌పై యుద్ధమేఘాలు ముసురుకుంటున్నాయి. తైవాన్‌లో శనివారం జరుగనున్న ఎన్నికల్లో వెలువడే ఫలితాల ఆధారంగా ఆ దేశ భవితవ్యం ఆధారపడి ఉంటుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. తైవాన్‌ను తన చెప్పుచేతుల్లోకి తీసుకోవాలని భావిస్తున్న చైనా ఇప్పటికే ఉచ్చు బిగుస్తున్నది. ద్వీపకల్పాన్ని అష్టదిగ్బంధనం చేసిన చైనా ఆ దేశ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను కూడా తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నట్టు తెలుస్తున్నది. దీంతో తైవాన్‌లోని బ్యాంకులు మూతపడుతున్నాయి. ప్రజలు కోట్ల రూపాయల లావాదేవీలను ఆఫ్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు. తైవాన్‌లోని ప్రపంచంలోనే అత్యంత అధునాతన సెమికండక్టర్ పరిశ్రమ స్తంభించిపోయింది. చైనా ప్రత్యక్షంగా తన సేనలను పంపడం తప్ప మిగిలిన అన్ని విధాలుగా తైవాన్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నది. చైనా ప్రత్యక్షంగా దాడికి దిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు రూ.828 లక్షల కోట్ల నష్టం జరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

స్వయంప్రతిపత్తి పాలనలో ఉన్న తైవాన్‌ను చైనా తనదిగా భావిస్తున్నది. చైనా తమపై దాడిచేసిన రోజున కేవలం తమ రక్షణ వ్యవస్థకు, భద్రతా దళాలకు మాత్రమే నష్టం జరుగదని, తైవాన్‌ను పూర్తిగా ప్రపంచం నుండి వేరుచేయడానికి ప్రయత్నిస్తుందని ఆ దేశ సైబర్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే తైవాన్ కంప్యూటర్ నెట్‌వర్క్‌పై ప్రతిరోజు లక్షల సంఖ్యలో దాడులు జరుగుతున్నాయని తైవాన్ జాతీయ రక్షణ, భద్రత పరిశోధన సంస్థ నిపుణుడు క్రిస్టల్ టు చెప్పారు. ఇప్పటికే కొందరు తమ నెట్‌వర్క్‌ను వారి స్వాధీనంలోకి తీసుకొని 'ఆ రోజు' కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. చైనా ఆక్రమణను ప్రకటించగానే వారు తమ టెలికమ్యూనికేషన్లను, ఇంధనం, ఆర్థిక రంగాలను స్తంభింపచేయగలరని పేర్కొన్నారు. సైబర్ దుండగులు తైవాన్ ప్రభుత్వ, రక్షణ సంస్థలనే కాకుండా అక్కడి సెమికండక్టర్ పరిశ్రమను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థకు జీవనాడిగా పేర్కొనే చిప్స్ సరఫరాలో తైవాన్ కంపెనీలు కీలకంగా ఉన్న సంగతి తెలిసిందే. సెమికండక్టర్ పరిశ్రమలకు సంబంధించిన మౌలిక సదుపాయాలను అవసరమైతే ధ్వంసం చేస్తాం తప్ప వాటిని చైనా దళాల చేతిలో పడనివ్వబోమని అమెరికాకు చెందిన ఓ అధికారి గత ఏడాది అన్నారు.

2016 నుంచే ఒత్తిడి

డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీకి చెందిన త్సాయి ఇంగ్-వెన్ తైవాన్ అధ్యక్షురాలిగా ఎన్నికైన 2016 నుంచే చైనా ఆ దేశంపై దౌత్య పరమైన, సైనికపరమైన ఒత్తిడిని ప్రారంభించింది. తైవాన్ స్వతంత్ర దేశంగా ప్రకటించుకోవడంతోపాటు తమపై ఇతర దేశాల పెత్తనాన్ని నిరాకరించడం చైనాకు కంటగింపుగా మారింది. క్రమంగా తైవాన్‌కు అడ్డంకులు సృష్టించడం ప్రారంభించింది. దీంతో ఏదో ఓ రోజున చైనా తైవాన్‌పై దురాక్రమణకు పాల్పడవచ్చన్న ఊహాగానాలు మొదలయ్యాయి. సైబర్ దాడులతో చైనా ఆగిపోదని, ప్రపంచంతో తైవాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టేందుకు ప్రయత్నించగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

చైనా దాడి విలువ 10 లక్షల కోట్ల డాలర్లు

తైవాన్‌పై యుద్ధం జరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 10 లక్షల కోట్ల డాలర్ల మేర నష్టం జరుగుతుందని బ్లూమ్‌బర్గ్ ఎకనామిక్స్ సంస్థ అంచనా వేసింది. ఇది ప్రపంచ జీడీపీలో పదిశాతంగా ఉంటుందని పేర్కొంది. ఇది ఉక్రెయిన్ యుద్ధం కన్నా, కరోనా మహమ్మారి కన్నా, ప్రపంచ ఆర్థిక సంక్షోభం వల్ల జరిగిన నష్టం కన్నా ఎక్కువ అని తెలిపింది. తైవాన్ ప్రజల్లో పెరుగుతున్న జాతీయవాద భావన, వాషింగ్టన్ - బీజింగ్ మధ్య విచ్ఛిన్నమవుతున్న సంబంధాలు, పెరుగుతున్న చైనా ఆర్థిక, సైనిక శక్తిని బట్టి తైవాన్‌లో సంక్షోభం తప్పకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా దురాక్రమణకు పాల్పడితే.. తైవాన్‌లోని సెమికండక్టర్ల వ్యవస్థ కుప్పకూలుతుందని, దీంతో ప్రపంచవ్యాప్తంగా ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, స్మార్ట్‌ఫోన్ల తయారీ స్తంభించిపోతుందని అంటున్నారు.

శృంగారానికి భార్య నిరాకరించడం క్రూరత్వమే

విడాకులకు అది సహేతుక కారణమే: మధ్యప్రదేశ్ హైకోర్టు

భోపాల్: వివాహం జరిగిన తర్వాత భర్తతో శారీరక సంబంధానికి భార్య తిరస్కరించడం క్రూరత్వమే అవుతుందని, విడాకులు కోరడానికి ఇది చెల్లుబాటయ్యే కారణమేనని మధ్యప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. తన భార్య తనతో శారీరక సంబంధానికి తిరస్కరిస్తున్నారని, ఆమె నుంచి తనకు విడాకులు మంజూరు చేయాలని ఓ భర్త భోపాల్ కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే వీరికి విడాకులు మంజూరు చేయడానికి కోర్టు 2014 నవంబరులో తిరస్కరించింది. ఈ తీర్పును హైకోర్టు ఈ నెల 3న తోసిపుచ్చింది. వీరికి 2006 జూలై 12న వివాహం జరిగిందని, అదే నెల 28న భర్త విదేశాలకు వెళ్లారని, వివాహం జరిగిన తర్వాత, ఆయన విదేశాలకు వెళ్లడానికి మధ్య నున్న సమయంలో ఆమె శోభనానికి నిరాకరించారని హైకోర్టు గమనించింది. ఇది క్రూరత్వం కిందకే వస్తుందని పేర్కొంటూ విడాకులు మంజూరు చేసింది.

సీఈసీ, ఈసీ నియామకాల చట్టంపై స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ, జనవరి 12: భారత ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి కేంద్రం ఇటీవల తెచ్చిన కొత్త చట్టం అమలుపై స్టే విధించడానికి సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. దీనిపై దాఖలైన పలు పిటిషన్లను విచారించడానికి కోర్టు అంగీకరించింది. కేంద్రానికి నోటీసులు జారీచేసింది. ఏప్రిల్ లోగా సమాధానమివ్వాలని కోరింది.

ఆర్మీ వాహనాలపై ఉగ్రవాదుల కాల్పులు

- తిప్పికొట్టిన జవాన్లు

జమ్ము: జమ్ముకశ్మీరులోని పూంఛ్‌లో ఉగ్రవాదులు మళ్లీ రెచ్చిపోయారు. సైనిక వాహనాలపై ఆకస్మికంగా కాల్పులకు తెగబడ్డారు. అప్రమత్తమైన జవాన్లు వారిని తిప్పికొట్టారు. క్యాంప్‌నకు తిరిగి వెళ్తుండగా ఈ దాడి జరిగింది. కాల్పుల్లో సైనికులు ఎవరూ గాయపడలేదు. ఉగ్రవాదుల కోసం సైన్యం, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పూంఛ్ సెక్టర్‌లోని కృష్ణ ఘాటి వద్ద ఈ దాడి జరిగినట్లు భారత సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్ ట్వీట్‌చేసింది. ఇటీవల పూంఛ్ జిల్లాలో సైనిక వాహనంపై ముష్కరులు జరిపిన కాల్పుల్లో నలుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మూడు వారాల వ్యవధిలో ఉగ్రదాడి జరుగడం ఇది రెండోసారి.

రైల్వేలో ఇప్పటికే అందరికీ 55% రాయితీ ఇస్తున్నాం: వైష్ణవ్

అహ్మదాబాద్, జనవరి 12: రైలు చార్జీల్లో వృద్ధులు, జర్నలిస్టులకు రాయితీ పునరుద్ధరించాలన్న డిమాండ్‌పై రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మరోసారి సమాధానం దాటవేశారు. రైల్వే ప్రయాణాల చార్జీల్లో ప్రయాణికులకు ఇప్పటికే 55 శాతం రాయితీ ఇస్తున్నామని పేర్కొన్నారు. కొవిడ్ సంక్షోభానికి ముందున్న విధంగా సీనియర్ సిటిజన్లు, జర్నలిస్టులకు రాయితీ పునరుద్ధరణపై గురువారం అహ్మదాబాద్‌లో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు స్పందించారు. అయితే అడిగిన ప్రశ్నకు మాత్రం మంత్రి సూటిగా సమాధానం చెప్పలేదు. ప్రయాణికులకు ఇప్పటికే రాయితీ అందుతున్నదని, ప్రత్యేకంగా రాయితీ అవసరం లేదనట్టు ఆయన పరోక్షంగా చెప్పారు.

కర్ణాటక నుంచి లోక్‌సభకు నిర్మల, జైశంకర్ పోటీ?

న్యూఢిల్లీ/బెంగళూరు, జనవరి 12: కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, జైశంకర్‌ను కర్ణాటక నుంచి లోక్‌సభకు పోటీ చేయించాలని బీజేపీ అధిష్ఠానం భావిస్తున్నది. ప్రస్తుతం వీరిద్దరు రాజ్యసభ సభ్యులుగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. అయితే కర్ణాటకలోని క్లిష్ట పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని దక్షిణ కన్నడ నుంచి నిర్మలా సీతారామన్‌ను, ఉత్తర కన్నడ లేదా బెంగళూరు సౌత్, బెంగళూరు సెంట్రల్ నుంచి జైశంకర్‌ను పోటీకి దింపాలని బీజేపీ ఆలోచిస్తున్నది. మరోవైపు, సిట్టింగ్ ఎంపీల్లో దాదాపు సగం మందికిపైగా ఈ సారి పోటీ చేయమని అధిష్ఠానానికి చెప్తున్నారు. అధిక వయస్సు, అనారోగ్యాన్ని కారణంగా చూపుతున్నారు.

గోతిలో పడ్డ అంబులెన్స్.. లేచి కూర్చున్న 'శవం'!

చండీగఢ్, జనవరి 12: మన దేశంలోని రోడ్లపై గోతుల్లో పడి వాహనదారులు గాయపడ్డారనో, అప్పుడప్పుడు మరణించారనో వార్తలు చదువుతుంటాం. కానీ అలాంటి గోతిలో పడి కుదుపునకు లోనైన అంబులెన్స్‌లోని శవం ప్రాణం పోసుకుని లేచిన విచిత్ర ఘటన హర్యానాలో చోటుచేసుకుంది. రోడ్డుపై గొయ్యే తమ తాత ప్రాణాలను తిరిగి తెచ్చిందని అంబులెన్స్‌లో మృతదేహంతో పాటు వస్తున్న అతని మనుమడు సంబరపడుతూ తెలిపాడు. వివరాల్లోకి వెళితే... హర్యానాలోని కర్నల్‌లో నివసించే 80 ఏండ్ల దర్శన్ సింగ్‌కు అస్వస్థతగా ఉండటంతో పాటియాలలోని దవాఖానలో చేర్చారు. నాలుగురోజులు వెంటిలేటర్‌పై చికిత్స అందించిన తర్వాత గురువారం అతను మరణించినట్టు డాక్టర్లు ప్రకటించడంతో అతని మృతదేహాన్ని అంబులెన్స్‌లో వేసుకుని అతని మనుమడు బల్వాన్ గ్రామానికి బయలుదేరాడు. ఈలోగా గ్రామంలో దర్శన్ సింగ్ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంబులెన్స్ వస్తుండగా, దారిలో ఒక పెద్ద గోతిలో పడి కుదుపునకు గురవ్వడంతో దర్శన్‌సింగ్‌లో కదలిక కన్పించింది. దీంతో అతని మనుమడు వెంటనే దగ్గరలోని దవాఖానకు తరలించారు.

ఒక్క టెస్టుతో 18 క్యాన్సర్ల గుర్తింపు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): క్యాన్సర్ నిర్ధారణలో శాస్త్రవేత్తలు కీలక ముందడుగు వేశారు. 18 రకాల క్యాన్సర్‌లను ప్రారంభ దశలోనే గుర్తించే కొత్త డీఎన్ఎ పరీక్షను అభివృద్ధి చేశారు. ఇది వైద్య చరిత్రలో గొప్ప విప్లవంగా వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ పరీక్ష క్యాన్సర్ స్క్రీనింగ్‌లో కొత్త శకానికి నాంది పలుకుతుందని అంటున్నారు. ప్రత్యేకించి క్యాన్సర్లలో లింగ నిర్దిష్ట వ్యత్యాసాలను గుర్తించే విషయంలో ఆశాజనకంగా ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ పరీక్ష అత్యంత కచ్చితమైన, బహుళ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షకు మార్గం సుగమం చేస్తుందని చెప్పారు. పురుషులలో 93% శాతం, మహిళల్లో 84% శాతం క్యాన్సర్లను గుర్తించడం జరిగిందని, ఆ పరీక్షల్లో 99% కచ్చితమైన ఫలితాలు వెలువడ్డాయని శాస్త్రవేత్తలు బీఎంజే ఆంకాలజీ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధనా పత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆరుగురిలో ఒకరు క్యాన్సర్ కారణంగా మరణిస్తున్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

అమెజాన్ అడవుల్లో 3 వేల ఏండ్ల కిందటి నగరం

న్యూఢిల్లీ, జనవరి 12: ఈక్వెడార్‌లోని అమెజాన్ అడవుల్లో 3 వేల ఏండ్ల కిందటి మహానగరాన్ని పరిశోధకులు గుర్తించారు. ఇండ్లు, విపణి ప్రదేశాలు, సారవంతమైన నేలలతో విలసిల్లిన అపానో లోయలోని ఈ పురాతన నగరం రోడ్లు, కాలువల ద్వారా అనుసంధానమై ఉందని వారు వెల్లడించారు. లిడార్ అనే ప్రముఖ రిమోట్ సెన్సింగ్ పద్ధతి ద్వారా ఈ నగరాన్ని కనుగొన్నారు. 'అమెజాన్‌లో ఇదే పురాతనమైన ప్రాంతం. అమెజాన్ సంస్కృతులను చూసే దృక్కోణాన్ని ఈ నగరం మార్చేస్తుంది. చాలా మంది ప్రజలు చిన్న గుంపులుగా, బహుశా దిగంబరులై గుడిసెల్లో నివసిస్తూ భూమిని చదును చేస్తూ ఉండేవారు. మన పూర్వీకులు సంక్లిష్టమైన పట్టణ సమాజాల్లో నివసించారనే విషయాన్ని ఇది తెలియజేస్తుంది' అని ఈ అధ్యయన రచయితలు తెలిపారు. ఈ లిడార్ సర్వేను 2015లోనే నిర్వహించినా ఫలితాలను తాజాగా ప్రచురించారు. ఆనాటి ఈ ప్రాచీన నగరంలోని చెక్క భవనాల్లో చలి కాచుకొనే ప్రదేశాలను గుర్తించినట్టు పరిశోధకులు తెలిపారు.

మందులోకి లక్ష ఏండ్ల కిందటి ఐస్!

అబుదాబి: బార్లు, పబ్బుల్లో మందు తాగేవారు మద్యం గ్లాస్‌లలో ఐస్ క్యూబ్స్ వేసుకొని చిల్ అవుతుంటారు. అయితే, దుబాయ్‌లోని బార్లలో మందు తాగేవారు ఓ విభిన్న తరహా అనుభవాన్ని సొంతం చేసుకుంటున్నారు. ఇక్కడి ఎక్స్‌క్లూజివ్ బార్లలో మందులోకి లక్ష ఏండ్ల కిందటి హిమానీనదంలోని స్వచ్ఛమైన ఐస్‌ను వినియోగిస్తున్నారు. గ్రీన్‌ల్యాండ్‌లోని ఓ కంపెనీ ఆర్కిటిక్ ప్రాంతంలో స్వచ్ఛమైన ఐస్‌ను సేకరించి దుబాయ్‌కి సరఫరా చేస్తున్నది. అయితే, హిమానీనదాలను బద్దలుకొట్టి ఐస్‌ను సేకరిస్తుండటం గ్లోబల్ వార్మింగ్‌కు దారితీస్తుందని పర్యావరణవేత్తలు సదరు కంపెనీపై మండిపడుతున్నారు. తాము సేకరించే ఐస్ హిమానీ నదానిది కాదని, గ్లేసియర్ నుంచి విడిపోయిన భాగం నుంచి ఐస్ సేకరిస్తున్నామని, ఇది పర్యావరణానికి ఎలాంటి హానీ చేయబోదని కంపెనీ వాదిస్తున్నది.

అయోధ్యలో హోటల్ గదికి రూ.లక్ష

రామమందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో 500 శాతం పెరిగిన ధరలు

అయోధ్య, జనవరి 12: అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవానికి సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో అక్కడి హోటళ్ల అద్దె ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రూమ్ రేట్లు ఏకంగా 500 శాతం పెరిగాయి. అంతేకాకుండా, ప్రతి 10 గదులకు 8 గదులు నిండిపోయాయని అధికారులు వెల్లడించారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి సుమారు 5 లక్షల మంది వరకు నగరానికి వచ్చే అవకాశం ఉందని అంచనావేస్తున్నారు. నగరంలోని ప్రముఖ హోటల్ 'ఇన్ రాడిషన్'లో గది అద్దె రూ.లక్ష వరకు చేరినట్టు ఇండియా టుడే నివేదిక వెల్లడించింది.

ప్రధాని 11 రోజుల దీక్ష

అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన వేళ 11 రోజుల ఉపవాస దీక్ష చేపట్టనున్నట్టు ప్రధాని మోదీ పేర్కొన్నారు. రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపనను స్వయంగా ప్రధాని మోదీ చేతుల మీదుగా జరగనున్నది. ఈ నేపథ్యంలో పండితుల సూచన మేరకు ఈ 11 రోజుల పాటు తాను ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు తెలిపారు.

రామయ్యకు 2.5 కిలోల విల్లు

ప్రాణప్రతిష్ఠ వేళ శ్రీరాముడు 2.5 కిలోల విల్లును ధరించబోతున్నాడు. దీన్ని అయోధ్యకు చెందిన అమవా రామాలయ నిర్వాహకులు శ్రీరామ్‌జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందజేయనున్నారు. అచ్చంగా రామాయణంలో చెప్పినట్టే ఈ విల్లును రూపొందించినట్టు ఆలయ ట్రస్టీ ఒకరు తెలిపారు. ఈ విల్లు కోసం 600-700 గ్రాముల బంగారాన్ని వాడామని పేర్కొన్నారు.

తన సన్నిహితుడికి బహుమతిగా ఇవ్వడానికి అయోధ్య రామాలయ నమూనాను కొనుగోలు చేసిన రామ జన్మభూమి-బాబ్రీ మసీదు కేసు కక్షిదారు ఇక్బాల్ అన్సారీ

రామాయణ సెల్‌ఫోన్ కవర్లకు డిమాండ్

రామాయణ థీమ్‌తో కూడిన బ్యాక్ కవర్లు, రామమందిరం, రాముడు, హనుమంతుడి చిత్రాలతో కూడిన కాషాయ జెండాలకు డిమాండ్ ఏర్పడింది.

ఉజ్జయిని నుంచి 5 లక్షల లడ్డూలు

ఉజ్జయిని మహాకాళేశ్వర్ ఆలయం నుంచి అయోధ్యకు 5 లక్షల లడ్డూలను పంపనున్నట్టు మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ తెలిపారు.

3 రోజులు రాకపోకలు బంద్

రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో చుట్టుపక్కల ఉన్న జిల్లాల వాసులు అయోధ్యకు రావటాన్ని అధికారులు మూడు రోజుల పాటు నిషేధించారు. బస్తి, గోండా, సుల్తాన్‌పూర్, బారాబంకీ, అంబేద్కర్ నగర్, అమేథీ ప్రాంతాల్లో ఈ నిషేధం విధించారు.

అయోధ్యలో తెలుగు సైన్ బోర్డు

28 ఇతర భాషల్లోనూ ఏర్పాటు

రాబోయే రోజుల్లో అయోధ్యకు దేశ, విదేశాల నుంచి కోట్లాది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో పట్టణవ్యాప్తంగా సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఆ సైన్ బోర్డులను 28 భాషల్లో రాయటం గమనార్హం. అందులో 22 భారతీయ భాషలు కాగా, 6 విదేశీ భాషలు ఉన్నాయి. హిందీ, ఉర్దూ, అస్సామీ, ఒరియా, కన్నడ, కశ్మీరీ, కొంకణి, గుజరాతీ, డోగ్రీ, తమిళం, తెలుగు, నేపాలీ, పంజాబీ, బంగ్లా, బోడో, మణిపూరి, మరాఠీ, మలయాళం, మైథిలి, సంథాలి, సంస్కృతం, సింధీ, అరబిక్, చైనీస్, ఇంగ్లిష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్ తదితర భాషల్లో సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు.

ఆకాశ్-ఎన్‌జీ క్షిపణి పరీక్ష సక్సెస్

కొత్త తరం ఆకాశ్-ఎన్‌జీ క్షిపణిని భారత్ శుక్రవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని చాందీపూర్ టెస్ట్ రేంజ్ నుంచి ఈ పరీక్ష చేసినట్టు రక్షణ శాఖ తెలిపింది. ఎక్కువ వేగం కలిగిన మానవ రహిత గగన లక్ష్యంపై తక్కువ ఎత్తు నుంచి దీన్ని పరీక్షించినట్టు చెప్పింది. 80 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాన్ని ఆకాశ్-ఎన్‌జీ ఛేదిస్తుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన రేడియో ఫ్రీక్వెన్సీ సీకర్, లాంఛర్, బహుళ విధులు నిర్వహించే రాడార్, కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్ సిస్టమ్ పనితీరును ఈ క్షిపణి ప్రయోగం ద్వారా పరీక్షించారు.

దేశంలోనే అతిపెద్ద సముద్రపు బ్రిడ్జి

మహారాష్ట్రలో ప్రారంభించిన మోదీ • సముద్రంపైనే 16.5 కిలోమీటర్ల ప్రయాణం

ముంబై, జనవరి 12: మహారాష్ట్రలో నిర్మితమైన దేశంలోనే అతి పొడవైన సముద్రపు వంతెనను ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. 21.8 కిలోమీటర్ల పొడవుండే ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్(ఎంటీహెచ్ఎల్) ముంబైలోని సేవ్రి, రాయగఢ్ జిల్లాలోని నవా శేవాను కలుపుతుంది. రూ.17,840 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెనకు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయీ పేరుమీదుగా 'అటల్ సేతు' అని నామకరణం చేశారు. రెండు పాయింట్ల మధ్య ప్రస్తుతం ఉన్న గంటన్నరగా ఉన్న ప్రయాణ సమయం ఈ వంతెన ద్వారా 20 నిమిషాలకు తగ్గుతుంది. ఆరు లైన్లతో నిర్మించిన ఈ బ్రిడ్జి.. 16.5 కిలోమీటర్లు సముద్రం మీదుగానే వెళ్తుంది. బ్రిడ్జి ద్వారా ముంబై, నవీ ముంబై మధ్య దూరం, ప్రయాణ సమయం మరింత తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ వంతెనపై ఓపెన్ రోడ్ టోలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వాహనదారులు టోల్ బూతుల వద్ద ఆగకుండానే 100 కిలోమీటర్ల వరకు వేగంతో వెళ్లిపోవచ్చు.

హౌతీ సైనిక స్థావరాలపై దాడులు

- క్షిపణులతో విరుచుకుపడిన అమెరికా, బ్రిటన్
- డజనుకు పైగా లక్ష్యాలపై దాడులు
- ఎర్రసముద్రంలో నౌకలపై దాడులకు ప్రతీకారం
- ఐదుగురు చనిపోయారని హౌతీల ప్రకటన
- ప్రతిఘటన తప్పదని హెచ్చరిక
- పశ్చిమాసియాలో మరింత పెరిగిన ఉద్రిక్తతలు

ఇటీవల యెమెన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న హౌతీ తిరుగుబాటుదారులు

వాషింగ్టన్, జనవరి 12: ఇటీవలి కాలంలో ఎర్రసముద్రంలో వాణిజ్య నౌకలపై వరుసగా దాడులకు పాల్పడుతున్న యెమెన్ హౌతీ తిరుగుబాటుదారుల స్థావరాలను లక్ష్యంగా చేసుకొని అమెరికా, బ్రిటన్ తాజాగా ముప్పేట దాడికి దిగాయి. ఎర్రసముద్రంలో ఉద్రిక్తతలు రాజేసిన హౌతీలకు చెందిన డజనుకు పైగా ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఇరుదేశాల సైన్యాలు గురువారం పెద్దయెత్తున బాంబు దాడులు చేశాయి. హెచ్చరికలను హౌతీలు పట్టించుకోని నేపథ్యంలో చేపట్టిన ఈ ప్రతీకార దాడుల్లో రెండు దేశాల బలగాలు యుద్ధనౌక, జలాంతర్గామిని ఉపయోగించి టోమాహాక్ క్షిపణులను ప్రయోగించాయి. యుద్ధ విమానాలను కూడా ఉపయోగించినట్టు అమెరికా అధికారులు వెల్లడించారు. తాము దాడులు చేసిన లక్ష్యాల్లో వాయు రక్షణ, కోస్టల్ రాడార్ సైట్లు, డ్రోన్, క్షిపణి ఆయు